హ్యాపీ బర్త్‌డే కేసీఆర్ సార్

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను సదాశివనగర్ మండలం భూంపల్లిలో బీఆర్ఎస్ నాయకులు ముందస్తుగా జరుపుకొన్నారు. ఈనెల 17వ తేదీన కేసీఆర్ పుట్టినరోజు కాగా.. సదాశివనగర్ మాజీ జడ్పీటీసీ పడిగెల రాజేశ్వర్‌రావు ఆధ్వర్యంలో శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేండ్లలో తెలంగాణ అభివృద్ధి కోసం కేసీఆర్ ఎంతో పాటుపడ్డారని అన్నారు. ఆయనకు భగవంతుడు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దత్తు, పడిగెల విఠల్‌రావు, కిషన్‌రావు, రమేశ్, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

– రామారెడ్డి, ఫిబ్రవరి 14

అమరులైన జవాన్లకు ఘన నివాళి

బాన్సువాడలో కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న స్వచ్ఛ బాన్సువాడ టీం సభ్యులు

నస్రుల్లాబాద్/బాన్సువాడ టౌన్, ఫిబ్రవరి 15 : బీర్కూర్‌లోని బీసీ బాలుర గురుకుల పాఠశాలలో పుల్వామా దాడిలో అమరులైన జవాన్లకు విద్యార్థులు శుక్రవారం నివాళులర్పించారు. వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శివకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు. పుల్వామా దాడిలో ప్రాణాలు కోల్పోయిన వీర జవాన్లకు బాన్సువాడలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద స్వచ్ఛ బాన్సువాడ టీం సభ్యులు క్యాండిల్ వెలిగించి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్వచ్ఛ బాన్సువాడ టీం సభ్యులు గణేశ్, భవాని ప్రసాద్, హన్మాండ్లు, పోల్కం రాజు, శివ, అనిల్, రితేశ్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

బీర్కూర్‌లోని బీసీ బాలుర పాఠశాలలో అమరులైన జవాన్లకు నివాళులర్పిస్తున్న విద్యార్థులు

కంపుకొడుతున్న ప్రభుత్వ దవాఖాన

- పట్టించుకోని అధికారులు
- దుర్వాసనతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రోగులు, స్థానికులు

కామారెడ్డి, ఫిబ్రవరి 14 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో చెత్త కుండీలు ఏర్పాటు చేయకపోవడంతో చెత్త పేరుకుపోతున్నది. అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. దవాఖానకు చాలా మంది రోగులు, వారికి సంబంధించిన బంధువులు వస్తుంటారు. దవాఖాన ఆవరణలోనే వ్యర్థ పదార్థాలు వేయడం ద్వారా దుర్వాసన రావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దవాఖాన సిబ్బంది చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. దవాఖాన గోడకు ఆనుకొని కొన్ని ఇండ్లు ఉండడంతో దుర్వాసన ఇండ్లల్లోకి వస్తున్నదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు చెత్త కుండీలు ఏర్పాటు చేసి పేరుకుపోయిన చెత్తను తొలగించాలని వారు కోరుతున్నారు. సిబ్బంది అలసత్వంతో ఎక్కడి చెత్త అక్కడే ఉంటుంది. దీంతో దోమలు, క్రిమి కీటకాలు ఇండ్లల్లో ఉన్న ఆహార పదార్థాలపై వాలుతున్నాయని, అనారోగ్యం పాలవుతున్నామని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్తను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. పలుమార్లు విన్నవించినా అధికారులు స్పందించడం లేదని కాలనీవాసులు తెలిపారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌ను వివరణ కోరగా తాను ఇటీవల వచ్చానని, శానిటరి సిబ్బందితో మాట్లాడి చెత్త తీయిస్తానని చెప్పారు.

ప్రభుత్వ దవాఖానలో పేరుకుపోయిన చెత్త

మొక్కలు నాటి సంరక్షించాలి

కామారెడ్డి, ఫిబ్రవరి 14 : కామారెడ్డి మున్సిపల్ పరిధిలో శానిటేషన్, పార్కులో నిర్వహణ, వాటరింగ్ కార్యక్రమాలు నిరంతరం నిర్వహించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని పంచముఖి హనుమాన్ కాలనీలోని పార్కును కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. పార్కుల అభివృద్ధికి ఆయా వార్డుల్లోని వెల్ఫేర్ అసోసియేషన్, సీనియర్ సిటిజన్ల సహకారం తీసుకోవాలని సూచించారు. అనంతరం పార్కులో మొక్కను నాటి నీళ్లు పోశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి, డిప్యూటీ ఈఈ వేణుగోపాల్, ఏఈ శంకర్, మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

పరుగు పందెంలో రాష్ట్రస్థాయికి ఎంపిక

మాచారెడ్డి, ఫిబ్రవరి 14 : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న తగిరంచ శ్రావ్య జిల్లాస్థాయి రన్నింగ్ పోటీల్లో సత్తాచాటి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు కళాశాల క్రీడల ఇన్‌చార్జి నర్సింహులు తెలిపారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన పోటీల్లో పాల్గొని 400 మీటర్ల రన్నింగ్‌లో సిల్వర్ మెడల్ సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా శ్రావ్యను అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి

వర్ని (రుద్రూర్), ఫిబ్రవరి 14 : వర్ని మండలం పైడిమల్ గ్రామశివారులో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సదాశివనగర్ మండలం ఉత్నూర్ గ్రామానికి చెందిన గాండ్ల భారతి(42) తన భర్త రాజయ్యతో కలిసి పనినిమిత్తం బైక్‌పై బాన్సువాడకు వెళ్లి తిరిగి వస్తుండగా పైడిమల్ గ్రామశివారులో కల్వర్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భారతికి తీవ్రగాయాలు కాగా.. స్థానికులు నిజామాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. చికిత్సపొందుతూ గురువారం అర్ధరాత్రి మృతిచెందింది. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై రమేశ్ తెలిపారు.

వీధి దీపాలు వెలిగించండి

బాన్సువాడ టౌన్, ఫిబ్రవరి 14 : పట్టణంలోని ప్రధాన రహదారి నుంచి పాత బాన్సువాడకు వెళ్లే దారిలో బీసీ బాలుర వసతి గృహం నుంచి చమాన్ వరకు వీధి దీపాలు వెలగడం లేదు. ఈ దారి గుండా రాకపోకలు సాగించే పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి వెంటనే వీధి దీపాలు వెలిగించాలని స్థానికులు కోరుతున్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ

పలువురికి గాయాలు

కామారెడ్డి, ఫిబ్రవరి 14 : కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని ఇల్చిపూర్ గ్రామ శివారులో జాతీయ రహదారిపై యూటర్న్ తీసుకుంటున్న ఆర్టీసీ బస్సును లారీ ఢీకొన్న ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. దేవునిపల్లి ఎస్సై రాజు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నిజామాబాద్-1 డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సు నిజామాబాద్ నుంచి కామారెడ్డికి 15 మంది ప్రయాణికులతో వస్తున్నది. టేక్రియాల్ బైపాస్ బ్రిడ్జి కింద రోడ్డు పనులు కొనసాగుతున్నాయి. బైపాస్ బ్రిడ్జి నుంచి బస్సు వచ్చి కామారెడ్డి వైపు యూటర్న్ తీసుకుంటుండగా నిజామాబాద్ నుంచి వస్తున్న లారీ బస్సును మధ్యభాగంలో బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సు మధ్య భాగం నుజ్జునుజ్జు కాగా డ్రైవర్ రాములుతో సహా బస్సులో ప్రయాణిస్తున్న ఎనిమిది మందికి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రులను జిల్లా దవాఖానకు తరలించారు. ఇందులో ముగ్గురికి తీవ్ర గాయాలుకాగా మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదం గురించి ఎవరు కూడా ఫిర్యాదు చేయలేదని ఎస్సై తెలిపారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన లారీ

గణితంలో వంద మార్కులు సాధించవచ్చు

కామారెడ్డి, ఫిబ్రవరి 14 : జిల్లా కేంద్రంలోని షెడ్యూల్డ్ కులాల వెనుకబడిన తరగతుల, గిరిజన అభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో వసతి విద్యార్థులకు ప్రేరణ, అవగాహన తరగతులను విజయ స్ఫూర్తి పేరిట శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గణిత శాస్త్ర విషయ నిపుణుడు రామకృష్ణ హాజరయ్యాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గణితంలో సులభంగా వంద మార్కులు సాధించవచ్చని తెలిపారు. పదోతరగతి పరీక్షలకు ఎలా సిద్ధం కావాలి, గణితంలోని ముఖ్యమైన ప్రశ్నలకు ఎలా సమాధానాలు రాయాలో మెళకువలను వివరించారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్లు చక్రధర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

మాచారెడ్డి, ఫిబ్రవరి 14 : పాల్వంచ మండలంలోని ఇసాయిపేటకు చెందిన దాసరి మమత అదృశ్యమైనట్లు ఎస్సై అనిల్ తెలిపారు. శుక్రవారం ఉదయం గ్రామంలో కామారెడ్డి బస్సుఎక్కి వెళ్లిపోయింది. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. మమత భర్త మహిపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వైద్యం కోసం ఎదురుచూపు..

కామారెడ్డి, ఫిబ్రవరి 14 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో ఓ వ్యక్తి వైద్యం కోసం ఎదురుచూస్తున్నాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. రామారెడ్డి మండలం రెడ్డిపేట గ్రామానికి చెందిన ఊరకమ్మరి కిష్టయ్య గత నెల 30వ తేదీన జిల్లా ప్రభుత్వ దవాఖానలో చేరాడు. రెండు నెలల క్రితం కిష్టయ్యకు విద్యుత్ షాక్ తగిలి కాలికి తీవ్ర గాయమైంది. కాలి పాదం వద్ద సగానికి పైగా ఇన్ఫెక్షన్ అవుతుందని, అరికాలు నుంచి పైన కొంత భాగం వరకు తొలగించుకోవడానికి నిర్ణయించుకున్నాడు. ప్రైవేట్‌లో వైద్యం చేయించుకునే స్థోమతలేక ప్రభుత్వ దవాఖానలో చేరగా వైద్యులు ఆరోగ్యశ్రీ కింద అప్లై చేయగా ఆపరేషన్‌కు అనుమతి కూడా వచ్చింది అయితే బోన్ కటింగ్ మిషన్ లేదని, ఆర్డర్ పెట్టామని, వారంలో రోజుల్లో వస్తుందని వైద్యులు చెప్పారని తెలిపాడు. దీంతో కిష్టయ్య దవాఖానలోనే ఉన్నాడు. దవాఖానలోని నర్సులు రోజూ డ్రెస్సింగ్ చేస్తున్నారు. ప్రతి రోజు సాయంత్రం నుంచి రాత్రంతా కాలి నొప్పితో కిష్టయ్య బాధపడుతున్నాడు. శుక్రవారం ఆపరేషన్ చేస్తామని వైద్యులు చెప్పినా ఆపరేషన్ చేసే వైద్యుడి వేలికి గాయమైందని, నాలుగైదు రోజుల తర్వాత ఆపరేషన్ చేస్తామన్నారు. తన భర్తను కాపాడాలని భార్య శ్యామల వేడుకుంటున్నది. ఈ విషయమై దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ ఫరీదా ను వివరణ కోరగా ఆపరేషన్‌కు సంబంధించిన బోన్ కటింగ్ మిషన్ వచ్చిందని, కానీ రోగి కాలి ఇన్ఫెక్షన్ తగ్గలేదని, ఆపరేషన్‌కు సహకరించకపోవచ్చని చేయలేదని సమాధానం ఇచ్చారు. సోమవారం వరకు చూసి ఆపరేషన్ చేస్తామని తెలిపారు.

గ్రామ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

బాన్సువాడ రూరల్, ఫిబ్రవరి 14 : బాన్సువాడ మండలంలోని బోర్లం క్యాంపులో గ్రామ సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం డ్వాక్రా మహిళల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా బింగి మాధవి, ప్రధాన కార్యదర్శిగా సావిత్రి, ఉపాధ్యక్షురాలిగా పల్లె సత్యవ్వ, కోశాధికారిగా సంగెం విజయ, సహాయ కార్యదర్శిగా పల్లె గంగామణిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీసీ షాదుల్లా, వీఏవో సంజీవులు, డ్వాక్రా మహిళలు నాగమణి, ఉమా, రాజేశ్వరి, ఫాతిమా, సావిత్రి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కోఆర్డినేషన్ సమావేశం

నస్రుల్లాబాద్, ఫిబ్రవరి 14 : బీర్కూర్‌లోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, డీఆర్పీ, వీఆర్పీ, ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో ఎస్ఆర్‌పీ మహేశ్ శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

మండల మహిళా సమాఖ్య..

రాజంపేట్, ఫిబ్రవరి 14 : మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో మండల మహిళా సమైఖ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఎం రవీంద్రబాబు మాట్లాడుతూ.. మహిళా సంఘాలు అభివృద్ధి చెందేందుకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. స్త్రీనిధి ఆర్ఎం కిరణ్, ఏపీఎం సాయిలు, సీసీలు బాగయ్య, స్వామి, రమేశ్, సునీత, మేనేజర్ సౌజన్య పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతిని సెలవుదినంగా ప్రకటించాలి

మాట్లాడుతున్న బంజారా సంఘం నాయకులు

గాంధారి, ఫిబ్రవరి 14: గిరిజనులు ఆరాధ్య దైవం సేవాలాల్ మహరాజ్ జయంతి ఫిబ్రవరి 15ను జాతీయ సెలవు దినంగా ప్రకటించాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గాంధారిలో శుక్రవారం సమావేశమైన బంజారా సంఘం నాయకులు మాట్లాడుతూ.. గిరిజనుల లంబాడా భాషను అధికారికంగా గుర్తించి, రాజ్యాంగంలో చేర్చాలన్నారు. రాష్ట్ర మంత్రి వర్గం లో గిరిజన ఎమ్మెల్యేకు చోటు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ ఎంపీపీ రాధాబలరాం, మాజీ ఎంపీటీసీ శంకర్, గంగాధర్, పల్లెమడుగు శంకర్, ప్రేమ్‌దాస్,మిట్యా నాయక్, సక్రాంనాయక్, గబ్బర్‌సింగ్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ దవాఖానలను సద్వినియోగం చేసుకోవాలి

మాట్లాడుతున్న పద్మజ

నేషనల్ హెల్త్ మిషన్ జిల్లా అధికారిణి పద్మజ

ఎల్లారెడ్డి రూరల్/ నాగిరెడ్డిపేట, ఫిబ్రవరి 14: ప్రభుత్వ దవాఖానల సేవలను రోగులు సద్వినియోగం చేసుకోవాలని బస్తీ దవాఖాన మెడికల్ ఆఫీసర్, నేషనల్ హెల్త్ మిషన్ జిల్లా అధికారిణి పద్మజ అన్నారు. ఆమె శుక్రవారం ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని గండిమాసానిపేట్ బస్తీ దవాఖాన, నాగిరెడ్డిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. గండిమాసానిపేట్ బస్తీ దవాఖానలో జన ఆరోగ్య సమితి ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. స్టాఫ్ నర్సు, యూత్ కమిటీ, మహిళా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు. నాగిరెడ్డిపేట ఆరోగ్య కేంద్రంలో మందులు, వసతులను తనిఖీ చేశారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో లభించే సేవలు, జాతీయ కార్యక్రమాల్లో అనుసంచరించాల్సిన విధానాలను సిబ్బందికి వివరించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి సృజన్ కుమార్, హెల్త్ సూపర్‌వైజర్లు సునంద, మణెమ్మ, డీఈవో బాలకృష్ణ, ఫార్మాసిస్ట్ జయశ్రీ, సిబ్బంది హరి, మురళీకృష్ణ, మానస తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్
GOLD FINANCE
★మీ బంగారం మణప్పురం, ముత్తూట్, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్నా, మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9160077916. స్పాట్ క్యాష్.
NT-337308
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే, ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఆలయంలో చోరీ

వివరాలు సేకరిస్తున్న పోలీసులు

రామారెడ్డి, ఫిబ్రవరి 14: మండలంలోని సింగరాయిపల్లి పెద్దమ్మ ఆలయంలో చోరీ జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని దుండగులు గురువారం రాత్రి ఆలయ తలుపులు ధ్వంసం చేసి, లోనికి ప్రవేశించి అమ్మవారి బంగారు బొట్టు బిల్ల చోరీ చేశారు. హుండీని ధ్వంసం చేసి అందులోని డబ్బులను అపహరించుకుపోయారు. అనంతరం పక్కనే ఉన్న ఎల్లమ్మ ఆలయంలో దోపిడీకి యత్నించారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు శుక్రవారం ఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు నమోదు చేసుకున్నారు. సామగంజి స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏఎస్సై రవీందర్ తెలిపారు.

యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్‌ను రద్దుచేయాలి

గాంధారి, తాడ్వాయిలో యుద్ధభేరి పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

యుద్ధభేరి పోస్టర్లు ఆవిష్కించిన టీచర్లు

గాంధారి/ లింగంపేట, ఫిబ్రవరి 14: యూపీఎస్ (యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్)ను రద్దు చేయాలని కోరుతూ మార్చి 2న హైదరాబాద్‌లో నిర్వహించనున్న యుద్ధభేరి పోస్టర్లను గాంధారిలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీఎస్ సీపీఎస్ఈయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బాణాల భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో నిర్వహించనున్న కార్యక్రమానికి ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. పీఈటీఏ టీఎస్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్, మండల అధ్యక్షుడు చిరంజీవి, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌రాథోడ్, బాల్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. తాడ్వాయి మండలంలోని కృష్ణాజివాడి, తాడ్వాయి, బ్రాహ్మణ్‌పల్లి, కరడ్‌పల్లి, కన్కల్, దేమికలాన్, నందివాడ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో యుద్ధబేరి పోస్టర్లను ఉపాధ్యాయులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీఎస్‌సీపీఎస్ఈయూ రాష్ట్ర సాహితి బాధ్యుడు విష్ణువర్ధన్ మాట్లాడుతూ.. ఓపీఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తాడ్వాయి మండల శాఖ అధ్యక్షుడు గిర్మబోయి, బత్తుల శ్రీనివాస్, సంగాగౌడ్, ప్రదీప్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు జిల్లా జట్లు ఎంపిక

అండర్-16 కబడ్డీ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన బాలికలు, బాలుర జిల్లా జట్లు

గాంధారి, ఫిబ్రవరి 14: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు జిల్లా బాలబాలికల జట్లను ఎంపిక చేసినట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్ గౌడ్ తెలిపారు. గాంధారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం రాష్ట్ర స్థాయి అండర్ – 16 పోటీల్లో పాల్గొనే బాలురు, బాలికల జట్ల ఎంపికలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ చూపిన క్రీడాకారులను ఎంపిక చేశారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈనెల 20 తేదీ నుంచి వికారాబాద్ జిల్లా కేంద్రంలో జరుగనున్న 34వ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో కామారెడ్డి జిల్లా తరపున పాల్గొంటారని ఆయన తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు బాణాల భాస్కర్‌రెడ్డి, లక్ష్మణ్ రాథోడ్, రాజు, సంజీవ్, బాలకృష్ణ, అశ్విని, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జట్లు ఇవే..

బాలురు: అర్జున్, డోలాజీ, సాయికిరణ్, అరుణ్, గణేశ్, మధు, ప్రణీత్, నితిన్, మహేందర్, రామ్ చరణ్, దీపక్, శశీన్ కుమార్

బాలికలు: ఉష, కీర్తన, రిషిక, నవ్యశ్రీ, అశ్వింత, హారిక, షరోన్, ప్రియాంక, ఆరాధ్య, అస్మిత, వర్షిత, అంజలి

విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలి

ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో వెంకటేశం

ఎల్లారెడ్డి రూరల్, ఫిబ్రవరి 14: వార్షిక పరీక్షలకు ఎస్సెస్సీ విద్యార్థులను సిద్ధం చేయాలని ఎంఈవో వెంకటేశం అన్నారు. ఎల్లారెడ్డిలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన గణితం, జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన భౌతిక శాస్త్రం కాప్లెక్స్ సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. విద్యార్థుల్లో పరీక్షలపై ఉన్న భయాన్ని పోగొట్టాలని, ఎస్సెస్సీ పరీక్షల నిర్వహణలో వచ్చిన మార్పులు వారికి వివరించాలని సూచించారు. ప్రశ్నాపత్రాలపై క్యూ ఆర్ కోడ్‌తోపాటు సీరియల్ నంబర్ ముద్రిస్తారని తెలిపారు.

కబడ్డీ పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం

ట్రోఫీని అందజేస్తున్న నిర్వాహకులు

లింగంపేట, ఫిబ్రవరి14: గిరిజనుల ఆరాధ్య దైవమైన సంత్ సేవలాల్ జయంతి సందర్భంగా నిర్వహించిన కబడ్డీ పోటీ విజేతలకు నాయకుడు రఫీక్ శుక్రవారం బహుమతులు ప్రదానం చేశారు. మండలంలోని మాలోత్ తండాలో నిర్వహించిన ఈ పోటీల్లో విజేతగా నిలిచిన పిట్లం జట్టుకు రూ.16,888 నగదుతోపాటు జ్ఞాపిక అందజేశారు. ద్వితీయ స్థానంలో నిలిచిన లింగంపేట మండలం పర్మళ్ల తండా జట్టుకు రూ.8,888 నగదుతోపాటు జ్ఞాపిక బహూకరించారు. గిరిజన తండాలో క్రీడలు నిర్వహించిన నిర్వాహకులకు పలువురు అభినందించారు. కార్యక్రమంలో రమేశ్, రవీందర్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

చెత్తకుప్పలో 'జాతీయ జెండా'

ఎల్లారెడ్డి రూరల్, ఫిబ్రవరి 14: జాతీయ జెండాకు అవమానం జరిగింది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ కార్యాలయంలో జాతీయ జెండా తోరణాలు కట్టారు. వాటిని తొలగించి భద్రపర్చకుండా నిర్లక్ష్యంతో చెత్తకుప్పలో పారేశారు. జాతీయ జెండాను అవమానపర్చడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

వాహనాల తనిఖీ

లింగంపేట, ఫిబ్రవరి14: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదుట పోలీసులు శుక్రవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా వాహనాలపై ఉన్న పెండింగ్ చాలన్లను పరిశీలించారు. పెండింగ్ చాలన్లు చెల్లించకుంటే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు నడిపేవారు సీట్ బెల్ట్ కచ్చితంగా ధరించాలని సూచించారు.ఈ సందర్భంగా సరైన డ్రువపత్రాలు లేని, హెల్మెట్ ధరించని పలువురు వాహనదారులకు జరిమానా విధించారు.

సైబర్ మోసాలపై అవగాహన

ఎల్లారెడ్డి రూరల్, ఫిబ్రవరి 14: సైబర్ మోసాలకు గురైన వారు టోల్‌ఫ్రీ నంబర్ 1930కు కాల్‌చేసి, వివరాలు చెప్పాలని షీ టీం సభ్యులు శ్రీనివాస్, సుప్రజ తెలిపారు. ఎల్లారెడ్డి కస్తూర్బా పాఠశాల విద్యార్థులకు సైబర్ మోసాలు, నేరాలు, ఏహెచ్‌టీయూ, షీటీం కార్యక్రమాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో 100, 108, 1930, 181 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. ప్రతి మహిళా తన ఫోన్‌లో టీ – సేఫ్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని, ఇది వారికి అత్యవసర సమయంలో చాలా ఉపయోగపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

బిచ్కుంద, ఫిబ్రవరి 14: రంగారెడ్డి జిల్లా కోర్టులో మహిళా జడ్జిపై జరిగిన దాడికి నిరసనగా బిచ్కుంద లోని జూనియర్ సివిల్ కోర్టు న్యాయవాదులు శుక్రవారం విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా బిచ్కుంద బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రకాశ్ పటేల్ మాట్లాడుతూ.. మహిళా జడ్జిపై చెప్పు విసిరిన నిందితుడిని కఠినంగా శిక్షించాలన్నారు. మహిళా జడ్జిపై దాడి న్యాయ వ్యవస్థపై జరిగిన దాడిగా పరిగణిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో న్యాయవాదులు మల్లేశ్, మహమూద్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

కిందపడి వ్యక్తి మృతి

బిచ్కుంద, ఫిబ్రవరి 14: మద్యం మత్తులో కిందపడి యువకుడు మృతి చెందిన ఘటన బిచ్కుందలో చోటుచేసుకున్నది. ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పుల్కల్ గ